స్మార్ట్ బజార్ నుంచి దివాలీ అప్పెరల్ కలెక్షన్

హైదరాబాద్, నవంబర్ 6: హైపర్ మార్కెట్ చైన్ స్మార్ట్ బజార్ దివాలీ అప్పెరల్ కలెక్షన్‌ను ఒక ఫ్యాషన్ షో ద్వారా ఆవిష్కరించనుంది. స్మార్ట్ బజార్‌లో లభించే లైవ్‌స్మార్ట్ ఫ్యాషన్ దుస్తులను ప్రదర్శిస్తూ బెట్టివల్ ఫ్యాషన్ షోలో సెలబ్రిటీ షో స్టాపర్ శ్రద్ధా ఆర్య, ఇన్‌ఫ్లుయన్సర్లు, కస్టమర్లు రాంప్‌వాక్ చేస్తారని సంస్థ తెలిపింది. స్మార్ట్ బజార్ సోషల్ మీడియా హ్యాండిల్ ద్వారా ఈ ఫ్యాషన్ షో స్ట్రీమ్ అవుతుందని పేర్కొంది.

హెచ్‌పీసీఎల్ బంకుల్లో బ్యాటరీ మార్పిడి

ముంబై, నవంబర్ 6: దేశవ్యాప్తంగా ఉన్న పెట్రోల్ బంకుల్లో బ్యాటరీ మార్పిడి స్టేషన్లను ఏర్పాటు చేయబోతున్నట్టు హెచ్‌పీసీఎల్ ప్రకటించింది. ఇందుకోసం నాస్‌డాక్‌లో లిస్టైన బ్యాటరీ మార్పిడి సంస్థ గోగారోతో ఒప్పందాన్ని కుదుర్చుకున్నది. ఇరు సంస్థల మధ్య కుదిరిన ఒప్పందంలో భాగంగా దేశవ్యాప్తంగా హెచ్‌పీసీఎల్‌కు ఉన్న 21 వేల రిటైల్ అవుట్‌లెట్లలో బ్యాటరీ మార్పిడి మౌలిక సదుపాయాలు సమకూర్చనున్నది. ఈ సందర్భంగా గోగారో సీఈవో, ఫౌండర్ హోరేస్ లుకే మాట్లాడుతూ..హెచ్‌పీసీఎల్‌తో కుదుర్చుకున్న ఒప్పందంలో భాగంగా దేశీయంగా ద్విచక్ర వాహనాల కోసం వెయ్యి బ్యాటరీ మార్పిడి స్టేషన్లను ఏర్పాటు చేయబోతున్నట్టు ప్రకటించారు.

దివీస్ ల్యాబ్ ప్రాఫిట్ డౌన్

క్యూ2లో 29 శాతం తగ్గి రూ.348 కోట్లకు

హైదరాబాద్, నవంబర్ 6: రాష్ట్రానికి చెందిన ప్రముఖ ఫార్మా దివీస్ ల్యాబ్ నిరాశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. సెప్టెంబర్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను కంపెనీ కన్సాలిడేటెడ్ నికర లాభం ఏడాది ప్రాతిపదికన 29.50 శాతం తగ్గి రూ.348 కోట్లకు పరిమితమైంది. ఏడాది క్రితం ఇదే సమయంలో సంస్థ రూ.493.60 కోట్ల లాభాన్ని గడించింది. గతేడాది కరోనా ఔషధానికి డిమాండ్ అధికంగా ఉండటం వల్లనే లాభాలు భారీగా పెరిగాయని పేర్కొంది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం మూడు శాతం పెరిగి రూ.1,855 కోట్ల నుంచి రూ.1,909 కోట్లకు పెరిగాయి.

వడ్డీరేట్లకు చమురు సెగ!

వడ్డీరేట్లు మళ్లీ పెరగబోతున్నాయా?

గ్లోబల్ మార్కెట్‌లో విజృంభిస్తున్న ముడి చమురు ధరలు.. భారతీయ రుణగ్రహీతల ఈఎంఐలకు సెగ పెట్టనున్నాయా?

ప్రస్తుత పరిస్థితులు అవుననే సమాధానాన్నే ఇస్తున్నాయి. పెరుగుతూపోతున్న క్రూడ్ ఆయిల్ రేట్లు.. ఆర్బీఐ రెపోరేటును పరుగులు పెట్టించనున్నాయనే అంచనాలు మొదలయ్యాయి మరి. ఇదే జరిగితే బ్యాంకు రుణాలు ప్రియమే. జేబుల్లోంచి మరింత సొమ్ము అప్పులను తీర్చేందుకు వెళ్లాల్సిందే.

గ్లోబల్ మార్కెట్‌లో క్రూడ్ ధరలు పెరిగితే మళ్లీ ఆర్బీ ఐ వడ్డింపులు

బ్యారెల్ 110 డాలర్లు పలికితే ఇబ్బందేనన్న అభిప్రాయాలు

ద్రవ్యోల్బణం, క్యాడ్ పెరిగేందుకు అవకాశాలు: మోర్గాన్ స్టాన్లీ అంచనా

న్యూఢిల్లీ, నవంబర్ 6: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) కీలక వడ్డీరేట్లను మళ్లీ పెంచే అవకాశాలు కనిపిస్తున్నాయి. కరోనా సమయంలో దిగాలుపడిన దేశ వృద్ధిరేటు బలోపేతానికి భారీగా తగ్గించిన రెపోరేటును.. ఆ తర్వాత ద్రవ్యోల్బణం అదుపు పేరుతో రికార్డు స్థాయికి పెంచిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే నిరుడు మే నెల నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి వరకు రెపోరేటు 250 బేసిస్ పాయింట్లు ఎగబాకింది. అయితే అప్పట్నుంచి వడ్డీరేట్ల జోలికి వెళ్లకుండానే ద్రవ్యసమీక్షల్ని చేస్తూ వస్తున్న ఆర్బీఐని.. ఇప్పుడు విజృంభిస్తున్న ముడి చమురు ధరలు తిరిగి వడ్డింపుల దిశగా నడిపించేలా ఉన్నాయి. ప్రముఖ అంతర్జాతీయ ఆర్థిక సేవల దిగ్గజం మోర్గాన్ స్టాన్లీ తాజా నివేదిక ఒకటి ఇదే అంటున్నది మరి. నిజానికి వచ్చే ఏడాది ఏప్రిల్-జూన్ నుంచి ఆర్బీఐ వడ్డీరేట్లు తగ్గుతాయని ఇంతకుముందు మోర్గాన్ స్టాన్లీ అంచనా వేసింది. అయితే క్రూడ్ ఆయిల్ ధరలు వీటిని తలకిందులు చేస్తున్నాయి.

ముమ్మందు ఇబ్బందులేనా?

గ్లోబల్ మార్కెట్‌లో బ్యారెల్ బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర 110 డాలర్ల ఎగువకు చేరితే.. భారత్‌కు ఇబ్బందులు మొదలవుతాయని మోర్గాన్ స్టాన్లీ అంచనా వేస్తున్నది. దేశ కరెంట్ ఖాతా లోటు (క్యాడ్) విస్తరిస్తుందని, ద్రవ్యోల్బణం పెరుగుతుందని, డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ పడిపోతుందని పేర్కొంటున్నది. ఇవే జరిగితే రిజర్వ్ బ్యాంక్ మళ్లీ వడ్డీరేట్ల పెంపునకు దిగుతుందని స్పష్టం చేస్తున్నది. ఇప్పటికే ద్రవ్యోల్బణం తారెత్తిస్తున్న సంగతి విదితమే. మార్కెట్‌లో కూరగాయలు, పండ్లు, మాంసం, గుడ్లు, చేపలు, పప్పు దినుసులు, ఇతరత్రా కిరాణా సరకుల రేట్లు పరుగులు పెడుతున్నాయి.

ఈఎంఐలు భారం

ప్రస్తుతం రెపోరేటు 6.5 శాతం వద్ద ఉన్నది. ఆర్బీఐ వడ్డీరేట్లు పెంచితే ఇది మరింత పెరుగుతుంది. దీంతో గృహ, వాహన, వ్యక్తిగత తదితర బ్యాంకింగ్ రుణాలు భారంగా మారుతాయి. అయితే కొత్త రుణగ్రహీతల సంగతి పక్కనబెడితే, ఇప్పటికే అప్పులు తీసుకున్నవారి పరిస్థితి మాత్రం ఇబ్బందికరమేనని చెప్పాలి. నిజానికి ఇప్పుడున్న రుణాల్లో చాలా వరకు కరోనా టైంలో వడ్డీరేట్లు తగ్గడాన్ని చూసి తీసుకున్నవే. వీటిపై వడ్డీరేట్లు 2.5 శాతానికిపైగా ఇప్పటికే పెరిగాయి. ఈఎంఐలు కట్టలేక ఎంతోమంది రుణాల పునర్‌వ్యవస్థీకరణకు, వడ్డీరేట్ల సవరణలకూ దిగుతున్నారు. ఈ సమయంలో మళ్లీ వడ్డీరేట్ల పెంపు అంటే అంతా సంక్షోభంలో పడ్డట్టేనన్న ఆందోళనలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ఇది అటు బ్యాంకింగ్ వ్యవస్థకు, ఇటు దేశ జీడీపీకి కూడా శ్రేయస్కరం కాదంటున్నారు.

ఎన్నికల తర్వాత పెట్రో మంటలే..

ఆయా రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యానే దేశంలో ప్రస్తుతం పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలు స్థిరంగా ఉంటున్నాయి. ఇక వచ్చే ఏడాది పార్లమెంట్ ఎన్నికలు కూడా ఉన్నాయి. దీంతో మరో 6-7 నెలలపాటు ఇంధన ధరల్లో ఎలాంటి మార్పూ ఉండదనే చెప్పాలి. గ్లోబల్ మార్కెట్‌లో ముడి చమురు ధరలు ఎంత పెరిగినా ఇక్కడ మాత్రం ఇంతే. కానీ ఎన్నికలు ముగిస్తే ధరలు ఒక్కసారిగా పెరుగుతూపోతాయని, లీటర్ పెట్రోల్, డీజిల్ తోపాటు వంటగ్యాస్ ధరలూ రికార్డు స్థాయికి చేరినా ఆశ్చర్యపోనక్కర్లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో రవాణా ఖర్చులు పెరిగి అన్ని రకాల వస్తూత్పత్తుల ధరలు కొండెక్కుతాయని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఫలితంగా ద్రవ్యోల్బణం పైపైకి వెళ్తుందని, అందుకు తగ్గట్టే ఆర్బీఐ వడ్డీరేట్ల బాదుడు, బ్యాంకు రుణాలు ప్రియం కావడం జరుగుతుందని అంటున్నారు.

- **ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2023-24)గాను ఆర్బీఐ ద్రవ్యోల్బణం అంచనా 5.4 శాతం. అక్టోబర్-మార్చిలో బ్యారెల్ ముడి చమురు సగటు ధర 85 డాలర్లుగా ఉంటుందని వేసిన అంచనా ఇది.**
- **ప్రస్తుతం బ్రెంట్ క్రూడ్ ఆయిల్ కాంట్రాక్ట్ 85 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతున్నది. ఇది పెరిగితే ఆర్బీఐ ద్రవ్యోల్బణం అంచనా కూడా పెరుగుతూపోతుంది.**
- **ఈ అక్టోబర్-డిసెంబర్ త్రైమాసికంలో బ్యారెల్ చమురు ధరలు 95 డాలర్లకు చేరుతాయని మోర్గాన్ స్టాన్లీ అంచనా.**
- **ఇదే గ్లోబల్ మార్కెట్‌లో ముడి చమురు ధరలు పెరగడం వల్ల ప్రభావితమయ్యే దేశాల్లో భారత్ కూడా ఒకటి. దేశ జీడీపీలో ఆయిల్ ట్రేడ్ బ్యాలెన్స్ మైనస్ 2.6 శాతంగా ఉన్నది.**
- **చమురు మార్కెట్లకు కొత్త చిక్కుల్ని తెచ్చిపెట్టిన ఇజ్రాయెల్-హమాస్ యుద్ధం. మరింత పెరిగిన భౌగోళిక రాజకీయ సంక్షోభం.**

అధిక చమురు ధరలు స్థిరంగా ఉంటే భారత్ జీడీపీలో కరెంట్ ఖాతా లోటు 2.5 శాతాన్ని దాటిపోతుంది. ఇది ఏమాత్రం మంచిది కాదు. బ్యారెల్ చమురు ధర 10 డాలర్లు పెరుగుతూపోయిన కొద్దీ ద్రవ్యోల్బణం 50 బేసిస్ పాయింట్ల చొప్పున ఎగిసిపడుతుంది. ఈ క్రమంలో కరెంట్ ఖాతా లోటు కూడా 30 బేసిస్ పాయింట్లు పెరిగేందుకు వీలున్నది.
-మోర్గాన్ స్టాన్లీ ఆర్థికవేత్తలు

ఎఫ్‌ఎంసీజీకి అదానీ గుడ్‌బై!

అదానీ విల్మార్ విక్రయానికి చర్చలు

న్యూఢిల్లీ, నవంబర్ 6: ప్రధాని నరేంద్ర మోదీ సన్నిహిత మిత్రుడిగా పేరొందిన గౌతమ్ అదానీ వాణిజ్య సామ్రాజ్యంపై తీవ్ర ఆరోపణల్ని గుప్పిస్తూ యూఎస్ హెడ్ ఫండ్ హిండెన్‌బర్గ్ ఈ ఏడాది ప్రారంభంలో విడుదల చేసిన నివేదిక ప్రభావం అదానీ గ్రూప్‌పై క్రమేపీ పడుతున్నది. అప్పట్లోనే హిండెన్‌బర్గ్ రిపోర్ట్ దెబ్బకు తన ఫ్లాగ్‌షిప్ కంపెనీ అదానీ ఎంటర్‌ప్రైజెస్ ఫాలో ఆన్ పబ్లిక్ ఆఫర్ (ఎఫ్‌పీవో)ను రద్దు చేసుకున్న ఈ గ్రూప్ తాజాగా ఫాస్ట్ మూవింగ్ కన్జ్యూమర్ గూడ్స్ (ఎఫ్‌ఎంసీజీ) వ్యాపారానికి గుడ్‌బై చెప్పనున్నట్టు సమాచారం. ఫార్చ్యూన్ బ్రాండ్ వంటనూనెల్ని విక్రయించే ఎఫ్‌ఎంసీజీ కంపెనీ అదానీ విల్మార్ నుంచి పూర్తిగా వైదొలగాలని అదానీ గ్రూప్ నిర్ణయించినట్టు ఎకనామిక్ టైమ్స్ తాజా కథనంలో పేర్కొంది. సింగపూర్‌కు చెందిన విల్మార్ ఇంటర్నేషనల్‌తో కలిసి ఏర్పాటు చేసిన ఈ వెంచర్లో అదానీ గ్రూప్‌నకు 43.97 శాతం వాటా ఉన్నది. ఈ వాటా విక్రయంతో 2.5-3 బిలియన్ డాలర్లు (రూ.23,300-24,975 కోట్లు) లభిస్తాయని అంచనా. పలు సంస్థలతో చర్చలు జరుగుతున్నాయని, నెలరోజుల్లోగా ఈ లావాదేవీ ఖరారు అవుతుందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఫార్చ్యూన్‌తో సహా కింగ్స్, బుల్లెట్, రాగ్, జూబ్లి, అల్ఫా, ఆధార్ తదితర నూనెలు, కిరాణా సరుకుల సంబంధిత బ్రాండ్లు అదానీ విల్మార్ పోర్ట్‌ఫోలియోలో ఉన్నాయి.

రుణ భారం తగ్గాలన్న తపన

హిండెన్‌బర్గ్ రిపోర్ట్ తర్వాత అదానీ గ్రూప్ షేర్లు నిలువునా పతనంకావడంతో మదుపరుల విశ్వాసం బాగా దెబ్బతిన్నది. అప్పటికే భారీగా రూ.2.5 లక్షల కోట్ల రుణభారం ఉన్న అదానీ గ్రూప్ షేరు విలువల క్షీణత కారణంగా రుణ చెల్లింపులపై సందేహాలు మొదలయ్యాయి. దీంతో పలు కంపెనీల్లో కొద్దికొద్దిగా వాటాల్ని తక్కువ విలువకే విక్రయించడం ద్వారా కొంత రుణాన్ని తగ్గించుకోవడం, తనఖా చేసిన షేర్లను విడిపించుకోవడం వంటి కార్యకలాపాల ద్వారా మదుపరుల విశ్వాసం కొంత మేర కోలుకున్నది. ఈ నేపథ్యంలో గ్రూప్‌నకు అప్రధాన ఆస్తుల్ని విక్రయించి నగదు నిల్వల్ని పెంచుకునే దిశగా ఎఫ్‌ఎంసీజీ వ్యాపారం నుంచి వైదొలుగుతున్నట్టు విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ ఏడాది మార్చిలో నాలుగు కంపెనీల్లో అదానీ గ్రూప్ ప్రమోటర్లు కొంత వాటాల్ని అమెరికా ఈక్విటీ ఫండ్ జీక్యూజీ పార్టనర్స్‌కు రూ.15,000 కోట్లు, జూన్‌లో మూడు కంపెనీల్లో మరి కొంత వాటాల్ని అమ్మి రూ.11,330 కోట్లు సమీకరించారు. ఇటీవల అదానీ గ్రీన్ ఎనర్జీలో 2.8 శాతం వాటాను ఖతార్ ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీకి రూ.4,130 కోట్లకు విక్రయించారు.

రిలయన్స్ పోటీ

దేశంలో రిటైల్ వ్యాపారానికి వృద్ధి అవకాశాలున్నప్పటికీ, పలు బహుళజాతి కంపెనీలతో (ఎంఎన్‌సీలు) పాటే దేశీయ సంస్థల పోటీ తీవ్రతరమవుతున్నది. యూనీలీవర్, నెస్లే తదితర గ్లోబల్ దిగ్గజాలతో పాటు దేశీయంగా వ్యాపారం చేస్తున్న ఐటీసీ, బ్రిటానియా, పతంజలి గ్రూప్‌లతో అదానీ పోటీ ఎదుర్కొంటున్నది. ముఖ్యంగా అదానీ విల్మార్ వంటనూనెలు, ఆహార ధాన్యాలు, కిరాణా దినుసులకు పోటీగా రిలయన్స్ రిటైల్ 'ఇండిపెండెన్స్' బ్రాండ్‌ను ప్రారంభించింది. బిస్కెట్స్, వంటనూనెలు, ప్యాకేజ్డ్ పిండి విభాగంలో పతంజలి ఫుడ్స్, బిస్కెట్లలో పార్లే, బ్రిటానియాలు, పప్పు దినుసులు, ప్యాకేజ్డ్ వాటర్‌లో టాటా కన్జూమర్, ప్యాకేజ్డ్ పిండి, బిస్కెట్లలో ఐటీసీలు పోటీపడుతున్నాయి. వంటనూనెల విభాగంలో అదానీ విల్మార్ మార్కెట్ వాటాను కొల్లగొట్టేందుకు రిలయన్స్ ప్రయత్నాలు ముమ్మరంకావడంతో అదానీ గ్రూప్ బ్రాండెడ్ రైస్, గోధుమ పిండి, చక్కెర అమ్మడం ప్రారంభించింది. ప్రీమియం బాస్మతి బియ్యం బ్రాండ్ కోహినూర్‌ను, చౌక బాస్మతి బ్రాండ్ చార్మినార్‌ను కొనుగోలు చేసింది. మరోవైపు గత రెండేండ్లలో రిలయన్స్ దాదాపు ఒక డజను ఎఫ్‌ఎంసీజీ బ్రాండ్లను కొన్నది. ఈ రెండింటి పోటీ నడుమ టాటా కన్జూమర్ ప్రాడక్ట్స్ సైతం బ్రాండ్ల వరుస కొనుగోళ్లు జరుపుతూ పోటీని తీవ్రతరం చేస్తున్నది. ఈ నేపథ్యంలో హిండెన్‌బర్గ్ నివేదిక కారణంగా ఒత్తిడిలో ఉన్న అదానీ గ్రూప్‌నకు ఎఫ్‌ఎంసీజీ వ్యాపారంలో పోటీకి భారీ నిధులు అవసరమవుతాయి. దీంతో మొత్తంగా ఈ వ్యాపారం నుంచి వైదొలిగేందుకే అదానీ మొగ్గుచూపిందని ఎకానమిక్ టైమ్స్ వివరించింది.

హైదరాబాద్‌లో గిడ్డంగులకు డిమాండ్

6 నెలల్లో 27 లక్షల చదరపు అడుగుల స్థలం లీజుకు

హైదరాబాద్ సిటీబ్యూరో, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ): గిడ్డంగుల లీజులో హైదరాబాద్ అత్యధిక వృద్ధిని నమోదు చేసుకున్నది. ఈ ఏప్రిల్-సెప్టెంబర్‌లో 27 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణం లీజింగ్ జరిగినట్టు తాజాగా నైట్‌ఫ్రాంక్ వెల్లడించింది. దేశవ్యాప్తంగా 8 మెట్రో నగరాల్లో తీసుకున్న గిడ్డంగులపై ప్రత్యేక నివేదికను సోమవారం విడుదల చేసింది. పుణెలో 42 లక్షల చదరపు అడుగుల స్థలాన్ని లీజుకు తీసుకోగా.. ఆ తర్వాత ముంబైలో 36 లక్షలు, బెంగళూరులో 32 లక్షల చదరపు అడుగుల మేర లీజులు జరిగాయి. 27 లక్షలతో ఆ తర్వాతి స్థానంలో హైదరాబాద్ నిలిచింది. ఇక ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో 26 లక్షల చదరపు అడుగులు, చెన్నైలో 24 లక్షలు, అహ్మదాబాద్‌లో 21 లక్షలు, కోల్‌కతాలో 18 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో లావాదేవీలు జరిగినట్టు పేర్కొంది. దేశవ్యాప్తంగా 12 శాతం వేర్‌హౌసింగ్ మార్కెట్ వృద్ధిని నమోదు చేసుకోగా, అందులో హైదరాబాద్‌లో 2 శాతం, పుణె, చెన్నైలలో 4 శాతం, అహ్మదాబాద్‌లో 3 శాతం, కోల్‌కతాలో 2 శాతం, మిగిలిన మెట్రో నగరాల్లో 1 శాతం పెరిగాయి.

బజాజ్ ఎలక్ట్రికల్స్ నిరాశాజనకం

న్యూఢిల్లీ, నవంబర్ 6: ఈ జూలై-సెప్టెంబర్‌లో రూ.27.28 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది బజాజ్ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్. ఏడాది క్రితం ఇదే త్రైమాసికంలో రూ.62 కోట్లుగా ఉన్నది. ఇక సంస్థ విక్రయాలు 3.76 శాతం తగ్గి రూ.1,107.40 కోట్లకు పరిమితమయ్యాయి. కొనుగోలుదారుల డిమాండ్ సెంటిమెంట్ బలహీనంగా ఉన్నప్పటికీ నిలకడైన పనితీరు కనబరిచినట్టు కంపెనీ చైర్మన్ శేఖర్ బజాజ్ తెలిపారు. కంపెనీ నిర్వహణ ఖర్చులు 1.2 శాతం పెరిగి రూ.1,097.11 కోట్లకు చేరుకున్నాయి. వీటిలో కన్జూమర్ ప్రొడక్ట్స్‌ల నుంచి రూ.857.57 కోట్లు రాగా, లైటింగ్ సొల్యూషన్స్ నుంచి రూ.255.25 కోట్లు సమకూరినట్టు పేర్కొంది.

బిగ్'సి'లో దీపావళి ధమాకా ఆఫర్లు

హైదరాబాద్, నవంబర్ 6: ప్రముఖ మొబైల్ విక్రయ సంస్థ బిగ్'సి'.. దీపావళి ప్రత్యేక ధమాకా ఆఫర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. స్మార్ట్‌ఫోన్ కొనుగోలుపై రూ.10 వేల వరకు ఇన్‌స్టాంట్ క్యాష్‌బ్యాక్‌తో పాటు రూ.4 వేల వరకు విలువైన ఖచ్చిత బహుమతిని అందిస్తున్నట్టు కంపెనీ ఫౌండర్, సీఎండీ బాలు చౌదరి తెలిపారు. వీటితో పాటు స్మార్ట్‌వాచ్ ఆఫర్, లాయల్టీ పాయింట్స్ ఆఫర్, స్మార్ట్ టీవీ ఆఫర్, 1+1 ఎక్స్‌టెండెడ్ ఆఫర్ లాంటి మరెన్నో ఆఫర్లు కలవని ఆయన పేర్కొన్నారు. వీటితోపాటు బజాజ్ ఫైనాన్స్ కార్డుతో మొబైల్ కొనుగోలుపై రూ.9 వేల వరకు ఇన్‌స్టాంట్ క్యాష్ బ్యాక్, మొబైల్/స్మార్ట్ టీవీ/ల్యాప్‌టాప్ కొనుగోలుపై ఎస్బీఐ కార్డుతో రూ.3 వేల వరకు ఇన్‌స్టాంట్ డిస్కౌంట్, ఐడీఎఫ్ఎస్ కార్డు ద్వారా జరిపే లావాదేవీలకు రూ.7,500 వరకు ఇన్‌స్టాంట్ డిస్కౌంట్‌ను అందిస్తున్నది. ప్రతి స్మార్ట్ టీవీ కొనుగోలుపై ఖచ్చితమైన బహుమతితోపాటు రూ.5,199 విలువ కలిగిన ఫింగర్స్ బార్ స్పీకర్‌ను రూ.2,499కే, ఐఫోన్లపై రూ.7 వేల వరకు ప్రయోజనాలు కల్పిస్తున్నది.

మార్కెట్లలో కొనుగోళ్ల జోష్

మెరిసిన ఐటీ, బ్యాంకింగ్ షేర్లు

భారీ లాభాల్లో దేశీయ స్టాక్ మార్కెట్లు

సెన్సెక్స్ 595, నిఫ్టీ 181 పాయింట్లు వృద్ధి

లక్షల కోట్లు ఎగిసిన మదుపరుల సంపద

ముంబై, నవంబర్ 6: దేశీయ స్టాక్ మార్కెట్లలోకి దీపావళి సంబురాలు ముందే వచ్చినట్టున్నాయి. వరుస లాభాల్లో సూచీలు పరుగులు పెడుతున్నాయి. ఐటీ, ప్రైవేట్ బ్యాంకింగ్, క్యాపిటల్ గూడ్స్ షేర్లు మదుపరులను ఆకట్టుకోవడంతో కొనుగోళ్లకు పెద్దపీట వేశారు. ఈ క్రమంలోనే సోమవారం బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 594.91 పాయింట్లు లేదా 0.92 శాతం పుంజుకొని 64,958.69 వద్ద స్థిరపడింది. ఒకానొక దశలో 628.76 పాయింట్లు ఎగబాకడం గమనార్హం. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ సైతం 181.15 పాయింట్లు లేదా 0.94 శాతం ఎగిసి 19,411.75 వద్ద నిలిచింది. అంతకుముందు రెండు రోజుల్లోనూ సూచీలు లాభాల్లోనే ముగిశాయి. దీంతో ఈ మూడు రోజుల్లో సెన్సెక్స్ దాదాపు 1,367 పాయింట్లు, నిఫ్టీ 422 పాయింట్లు అందిపుచ్చుకున్నట్టైంది.

ఆది నుంచీ దూకుడే..

ఉదయం ట్రేడింగ్ మొదలైన దగ్గర్నుంచీ మదుపరులు పెట్టుబడులకు ప్రాధాన్యతనిచ్చారు. దీంతో సూచీలు ఆరంభంలోనే భారీ లాభాలను సొంతం చేసుకోగలిగాయి. సమయం గడుస్తున్నకొద్దీ ఈ లాభాలు పెరుగుతూపోగా.. ఆఖర్లో కొంతమేర అమ్మకాల ఒత్తిడి నెలకొన్నది. అయినప్పటికీ ఆకర్షణీయ వృద్ధినే సూచీలు అందుకోగలిగాయి. గత వారం గురు, శక్రవారాల్లోనూ సూచీలు లాభాల్లోనే ముగియగా.. అంతకుముందు రోజుల్లో మాత్రం కొంత ఒడిదుడుకులకు లోనైన సంగతి విదితమే.

చిన్న షేర్లూ అదుర్స్

కేవలం బడా షేర్లకేగాక.. చిన్న, మధ్యశ్రేణి షేర్లకూ మదుపరులు క్యూ కట్టారు. ఈ క్రమంలోనే బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సూచీ 1 శాతం, మిడ్‌క్యాప్ సూచీ 0.90 శాతం ఎగిశాయి. ఇక సెన్సెక్స్ షేర్లలో ఎల్‌అండ్‌టీ, యాక్సిస్ బ్యాంక్, టాటా స్టీల్, బజాజ్ ఫైనాన్స్, పవర్ గ్రిడ్, ఏషియన్ పెయింట్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, బజాజ్ ఫిన్‌సర్వ్ షేర్లు జూమ్ అయ్యాయి. అయితే ఎస్బీఐ, హిందుస్థాన్ యునిలివర్, టాటా మోటర్స్, టైటాన్ షేర్లు నిరాశపర్చాయి. రంగాలవారీగా క్యాపిటల్ గూడ్స్ 1.68 శాతం, మెటల్ 1.64 శాతం, ఇండస్ట్రియల్స్ 1.42 శాతం, యుటిలిటీస్ 1.39 శాతం, కమోడిటీస్ 1.38 శాతం, చమురు-గ్యాస్ 1.33 శాతం, ఎనర్జీ 1.27 శాతం, రియల్టీ 1.19 శాతం, బ్యాంకింగ్ 0.74 శాతం, ఆటో షేర్లు 0.65 శాతం చొప్పున పెరిగాయి. కన్జ్యూమర్ డ్యూరబుల్స్ షేర్లు నష్టపోయాయి.

గ్లోబల్ మార్కెట్లలో..

అంతర్జాతీయ మార్కెట్ల విషయానికొస్తే.. దక్షిణ కొరియా, జపాన్, చైనా, హాంకాంగ్ సూచీలు లాభాల్లో ముగిశాయి. ఐరోపా మార్కెట్లలో మాత్రం ప్రధాన ఇండెక్స్‌లైన జర్మనీ, బ్రిటన్, ఫ్రాన్స్ నష్టాల్లో కదలాడుతున్నాయి. ఇక శుక్రవారం అమెరికా మార్కెట్లు లాభాల్లోనే ముగిసిన విషయం తెలిసిందే. కాగా, విదేశీ సంస్థాగత మదుపరులు (ఎఫ్ఐఐలు) పెట్టుబడుల ఉపసంహరణ దిశగా వెళ్తున్నారు. శుక్రవారం రూ.12.43 కోట్ల షేర్లను అమ్మేసినట్టు స్టాక్ ఎక్స్ఛేంజ్ గణాంకాలు చెప్తున్నాయి.

మార్కెట్ లాభాలకు కారణాలు

- కలిసొచ్చిన పండుగ సెంటిమెంట్
- పెట్టుబడులకు మదుపరుల పెద్దపీట
- ఆకట్టుకున్న ఐటీ, ప్రైవేట్ బ్యాంకింగ్ షేర్లు
- గ్లోబల్ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు
- వడ్డీరేట్ల పెంపునకు ఫెడ్ రిజర్వ్ విరామమిస్తుందన్న అంచనాలు

ర్యాలీతో 8 లక్షల కోట్లు

స్టాక్ మార్కెట్ల వరుస లాభాలు.. మదుపరుల సంపదనూ పెంచుతున్నాయి. గత మూడు రోజుల్లో బీఎస్ఈ నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.7.95 లక్షల కోట్లు ఎగబాకింది. రూ.7,95,290.63 కోట్లు పెరిగి రూ.3,18,17,766.44 కోట్లకు చేరినట్టు స్టాక్ ఎక్స్ఛేంజ్ వర్గాలు పేర్కొన్నాయి.

దేశీయ స్టాక్ మార్కెట్ల ట్రేడింగ్‌పై అంతర్జాతీయ పరిణామాల ప్రభావమే ఎక్కువగా కనిపించింది. ముఖ్యంగా అమెరికా ఉద్యోగ గణాంకాలు, ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ వడ్డీరేట్ల పెంపునకు విరామం ఇస్తుందన్న అంచనాలు మదుపరుల పెట్టుబడులను అధికంగా ప్రభావితం చేశాయి. అయితే చాలా రోజుల్నుంచి విదేశీ అంశాలపైనే దృష్టి పెట్టిన మదుపరులు.. తమ చూపును దేశీయ వ్యాపారాల వైపు తిప్పుకున్నారనిపిస్తున్నది. ఈ క్రమంలోనే పండుగ సెంటిమెంట్ కలిసొస్తున్నది.

-వినోద్ నాయర్, జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రిసెర్చ్ అధిపతి

వాహన అమ్మకాల్లో క్షీణత

- **అక్టోబర్ నెలలో 8 శాతం డౌన్: ఫడా**

న్యూఢిల్లీ, నవంబర్ 6: టాప్‌గేర్‌లో దూసుకుపోతున్న వాహన విక్రయాలకు ద్విచక్ర వాహనాలు గండికొట్టాయి. గత నెలలో మొత్తంగా దేశవ్యాప్తంగా 21,17,596 యూనిట్లు అమ్ముడయ్యాయని ఫెడరేషన్ ఆటోమొబైల్ డీలర్ల అసోసియేషన్(ఫడా) వెల్లడించింది. ఏడాది క్రితం ఇదే నెలలో అమ్ముడైన 22,95,099 యూనిట్లతో పోలిస్తే 8 శాతం తగ్గాయని సోమవారం విడుదల చేసిన నివేదికలో తెలిపింది.

- ద్విచక్ర వాహన విక్రయాలు 17,25,043 యూనిట్ల నుంచి 12.60 శాతం తగ్గి 15,07,756 యూనిట్లకు క్షీణత.
- ప్యాసింజర్ వాహన రిటైల్ అమ్మకాలు 1.35 శాతం తగ్గి 3,53,990లకే పరిమితమయ్యాయి. ఏడాది క్రితం 3,58,884 యూనిట్లు అమ్ముడయ్యాయి.
- త్రిచక్ర వాహన అమ్మకాలు మాత్రం 45.63 శాతం పెరిగి 1,04,711 యూనిట్లకు చేరాయి. ఏడాది క్రితం ఇది 71,903 యూనిట్లుగా ఉన్నాయి.
- ట్రాక్టర్ల రిటైల్ సేల్స్ 6.15 శాతం ఎగబాకి 62,440 యూనిట్లు అమ్ముడయ్యాయి.
- కమర్షియల్ వాహన విక్రయాలు 10.26 శాతం అధికమై 88,699 యూనిట్లకు చేరుకున్నాయి.

గత నెలలో తొలి పక్షం రోజుల్లో వాహనాలు కొనుగోలు చేయడానికి కస్టమర్లు వెనుకంజవేశారు. ప్రస్తుతం నవరాత్రి సీజన్ కావడంతో ఈ నెలలో భారీగా పెరిగే అవకాశం ఉన్నది.

**-మనీష్ రాజ్‌సింఘానియా, ఫడా ప్రెసిడెం